


మధు లిమాయే (1922- 1995) వర్ధంతి సందర్భంగా

Madhu Limaye (1922- 1995) On His Death Anniversary

మధు లిమాయే (1మే 1922-8జనవరి 1995) స్వాతంత్ర్య ఉద్యమంలో మరియు తరువాత పోర్చుగీస్ నుండి గోవా విముక్తిలో కీలక పాత్ర పోషించిన ఆధునిక భారతదేశపు అత్యంత విశిష్ట వ్యక్తులలో ఒకరు.

మధు లిమాయే నిబద్ధత కలిగిన సోషలిస్ట్, గొప్ప పార్లమెంటేరియన్, పౌర స్వేచ్ఛావాది, సఫలవంతమైన రచయిత మరియు దేశంలోని సామాన్య ప్రజల కోసం అంకిత భావం తో పనిచేసిన నాయకుడు. మధు లిమాయే ప్రజాస్వామ్య సోషలిస్ట్ ఉద్యమం యొక్క డైనమిక్ నాయకుడు మరియు తన జీవితాంతం తను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఉన్నాడు.

సరళత, కాఠిన్యం, ఉన్నత నైతిక దృక్పథం, శాంతి మరియు అహింస వంటి గాంధేయ సద్గుణాలు మధు లిమాయే పై గొప్ప ప్రభావాన్ని చూపాయి. మధు లిమాయే పై సద్గుణాలను అనుసరించాడు మరియు ఆచరించాడు మరియు దేశం లోని సోషలిస్ట్ నాయకుల పరంపరలో ఒక ప్రత్యేక స్థానాన్ని

సంపాదించాడు. సోషలిస్టు నాయకుడిగా దేశంలో సోషలిస్టు ఉద్యమానికి వివిధ దశల్లో మధు లిమాయే మార్గనిర్దేశం చేశారు.

ప్రారంభ జీవితం

శ్రీ రామచంద్ర మహాదేవ్ లిమాయే కుమారుడు మధు లిమాయే 1922 మే 1వ తేదీన మహారాష్ట్రలోని పూనా (పూణె) నగరంలో జన్మించారు. లిమాయే తన మిడిల్ స్కూల్ విద్యను రాబర్ట్ మనీ స్కూల్, బొంబాయి మరియు సరస్వతి మందిర్ పూణే లో అభ్యసించారు.

మధు లిమాయే ఒక తెలివైన విద్యార్థి, మరియు తన 5వ, 6వ మరియు 7వ తరగతిని కేవలం ఒక సంవత్సరంలోనే పూర్తి చేశారు. మధు లిమాయే 13 ఏళ్ల వయసులో మెట్రిక్యులేషన్ పరీక్షకు హాజరు కావడానికి వయస్సు తక్కువ కారణంగా అనుమతి పొందలేదు.

అధికారిక పాఠశాల విద్య/ఫార్మల్ స్కూల్ ఎడ్యుకేషణ్ లో అంతరాయం, మధు లిమాయేకి చరిత్ర, వివిధ దేశాలలో స్వాతంత్ర ఉద్యమం మరియు గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలపై పుస్తకాలు చదివే అవకాశాన్ని కల్పించింది.

పాఠశాల విద్య తర్వాత, మధు లిమాయే 1937లో పూనాలోని ఫెర్గూసన్ కళాశాలలో ఉన్నత విద్య కోసం చేరారు మరియు ప్రపంచ చరిత్ర, భారతీయ పరిపాలన, ఆంగ్లం మరియు సంస్కృతాలను సబ్జెక్టుగా ఎంచుకున్నాడు

కళాశాల రోజులలో మధు లిమాయే సోషలిస్టు ఆలోచనల వైపు ఆకర్షితుడయ్యాడు. విద్యార్థి ఉద్యమాల్లో పాల్గొనడం ప్రారంభించి, అఖిల భారత విద్యార్థి సమాఖ్య All India Students Federation(AISF) లో క్రియాశీల సభ్యునిగా మారారు. అప్పటి నుండే మానవాళిని వలసవాదం, లేమి మరియు

అన్యాయం నుండి విముక్తి చేయడానికి మధు లిమాయే యొక్క ప్రయాణం ప్రారంభమైంది.

స్వాతంత్ర్య సమరయోధుడు

మధు లిమాయే రాజకీయ ప్రవేశం  చాలా లేత వయస్సులో 1937లో పూనాలో తన 15వ పుట్టినరోజున మే డే ఊరేగింపులో పాల్గొన్నటంతో ఆరంభం అయ్యింది. ఆ ఊరేగింపుపై RSS వాలంటీర్లు హింసాత్మకంగా దాడి చేశారు. ఈ దాడిలో ఊరేగింపు నాయకులు సేనాపతి బాపట్, ఎస్ఎం జోషి గాయపడ్డారు. పోరాటం మరియు ప్రతిఘటన రాజకీయాలతో మధు లిమాయేకి  ఇది మొదటి పరిచయం

ఆ తర్వాత, మధు లిమాయే, SM జోషి, NG గోరే మరియు పాండురంగ్ S. సానే, అలియాస్ సానే గురు జీతో సన్నిహితంగా మెలిగారు మరియు సమకాలీనులు V.N అలియాస్ అన్నా సానే కేశవ్ అలియాస్ (బందు) గోరే, గంగాధర్ ఓగ్లే, మాధవ్ లిమాయే మరియు వినాయక్ కులకర్ణి తో పాటు జాతీయ ఉద్యమం మరియు సామ్యవాద భావజాలం వైపు తీవ్రంగా ఆకర్షితుడయ్యారు మరియు వారి స్టడీ సర్కిల్‌లో చేరారు. 31 డిసెంబర్ 1938న, ఈ బృందం భారత జాతీయ కాంగ్రెస్ మరియు CSP యొక్క పూర్తి సమయం కార్యకర్తలుగా  పనిచేయాలని నిర్ణయించుకుంది.

SM జోషి పూనా జిల్లా కాంగ్రెస్ కమిటీకి ప్రధాన కార్యదర్శిగా అలాగే కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీకి  ప్రొవిన్షియల్ కార్యదర్శిగా ఉన్నారు. 1939లో, SM జోషి, 17 సంవత్సరాల వయస్సులోఉన్న  మధు లిమాయేను పూనా కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ (CSP) జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించారు. యువ మధు లిమాయే పూనాలో భక్తిశ్రద్ధలతో CSPని నిర్వహించారు. అదే సంవత్సరం ఇద్దరు ప్రఖ్యాత సోషలిస్ట్ నాయకులు జయపరాకాష్ నారాయణ్ మరియు డాక్టర్ రామ్మనోహర్

లోహియా పూనాను సందర్శించారు మరియు మధు లిమాయే నైపుణ్యాలను చూసి ముగ్ధులయ్యారు.

1939లో, రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభమైనప్పుడు, వలస పాలన నుండి దేశాన్ని విముక్తి చేయడానికి ఇది ఒక అవకాశం అని మధు లిమాయే భావించారు.. అక్టోబరు 1940లో, మధు లిమాయే యుద్ధానికి వ్యతిరేకంగా ప్రచారం చేయడం ప్రారంభించాడు మరియు యుద్ధ వ్యతిరేక ప్రసంగాల కారణంగా అరెస్టయ్యారు  మరియు దాదాపు ఒక సంవత్సరం పాటు ఖందేష్ ప్రాంతంలోని ధూలియా జైలులో మధు లిమాయే ఉంచబడ్డారు.

మధు లిమాయే సెప్టెంబర్ 1941లో విడుదలయ్యారు మరియు మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాలలో రాష్ట్ర సేవాదళ్ మరియు యువజన శిబిరాలను నిర్వహించే పనిని చేపట్టారు.. ఆగస్టు 1942లో, మహాత్మా గాంధీ 'క్విట్ ఇండియా' పిలుపునిచ్చిన బొంబాయిలో,  AICC తన సమావేశాన్ని నిర్వహించింది. మధు లిమాయే గాంధీజీని దగ్గరగా చూడడం ఇదే మొదటిసారి.

గాంధీజీతో సహా పలువురు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులను అరెస్టు చేశారు. మధు లిమాయే తన సహచరులతో కలిసి అండర్‌గ్రౌండ్‌కి వెళ్లి అచ్యుత్ పట్వర్ధన్ మరియు అరుణ ఆసిఫ్ అలీతో కలిసి అండర్ గ్రౌండ్ ప్రతిఘటన ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. మధు లిమాయే ప్రింటింగ్ ప్రెస్‌ను స్థాపించారు మరియు అచ్యుత్ పట్వర్ధన్ మరియు ఎస్ఎమ్ జోషి సంపాదకత్వంలో ‘క్రాంతికారి’ అనే మరాఠీ పత్రికను ప్రారంభించారు

ఆ సమయంలో, మధు లిమాయే బాంబే సెంట్రల్ స్టేషన్ ముందు 'ముషక్ మహల్' అనే ప్రదేశంలో ఉండేవారు. 1943 ఏప్రిల్ 18న జరిగిన పోలీసుల దాడి లో సానే గురూజీ, ఎన్ జి గోరే, శ్రీభౌ లిమాయే మరియు మాధవ్ లిమాయేలు

అరెస్టు చేయబడ్డారు కాని ఎస్ఎమ్ జోషి మరియు మధు లిమాయే తప్పించుకున్నారు.

'ముషక్ మహల్'పై దాడి తర్వాత సోషలిస్టులు తమ రహస్య ప్రదేశాన్ని మార్చుకుని 'హడిల్ హౌస్' అనే కొత్త ప్రదేశానికి మారారు. సెప్టెంబరు 1943లో ఎస్ఎం జోషి, వినాయక్ కులకర్ణిలతో కలిసి మధు లిమాయే ను 'హడిల్ హౌస్' నుంచి అరెస్టు చేశారు. మధు లిమాయే డిఫెన్స్ ఆఫ్ ఇండియా రూల్స్ (DIR) కింద అరెస్టు చేయబడ్డారు మరియు జులై 1945 వరకు వర్లీ, ఎర్వాడ మరియు విసాపూర్ జైళ్లలో ఎటువంటి విచారణ లేకుండా నిర్బంధించబడ్డారు.

మధు లిమాయే నిర్బంధ సమయంలో, బ్రిటీష్ ప్రభుత్వ పోలీసులు తీవ్రమైన దౌర్జన్యాలు చేసిన్నప్పటికీ మధు లిమాయే పెదవి విప్పలేదు.

సోషలిస్టు ఉద్యమంలో

మధు లిమాయే భారత జాతీయ కాంగ్రెస్ మరియు కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీతో దాదాపు ఒక దశాబ్దం పాటు, (1938-48) అనుబంధం కలిగి ఉన్నారు. మధు లిమాయే ఫిబ్రవరి 1947లో CSP యొక్క కాన్పూర్ సమావేశానికి హాజరయ్యారు, అక్కడ కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ నుండి 'కాంగ్రెస్' అనే పదం తొలగించబడింది.

సోషలిస్ట్ పార్టీని పునర్వ్యవస్థీకరించడంలో మధు లిమాయే ముందంజలో ఉన్నారు మరియు ఖాందేష్ ప్రాంత బాధ్యతను మధు లిమాయే కు అప్పగించారు. మధు లిమాయే విజయవంతంగా ట్రేడ్ యూనియన్ కార్మికులను సమీకరించి, రైతులను మరియు యువతను సోషలిస్ట్ గూటికి తీసుకువచ్చారు.

1947లో, మధు లిమాయే సోషలిస్ట్ ఇంటర్నేషనల్ యొక్క ఆంట్వెర్ప్ Antwerp (బెల్జియం) సమావేశానికి భారత సోషలిస్ట్ ఉద్యమం యొక్క ఏకైక ప్రతినిధిగా హాజరయ్యారు. మధు  లిమాయే 1948 నాసిక్ కాన్ఫరెన్స్‌లో సోషలిస్ట్ పార్టీ నేషనల్ ఎగ్జిక్యూటివ్‌కు ఎన్నికయ్యారు మరియు 1949లో సోషలిస్ట్ పార్టీ పాట్నా కాన్ఫరెన్స్‌లో జాయింట్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. మధు  లిమాయే సెక్రటరీ, ఫారిన్ అఫైర్స్ కమిటీ, సోషలిస్ట్ పార్టీ మరియు 1953 లో ఆసియన్ సోషలిస్ట్ బ్యూరో, రంగూన్ కు ఎన్నికయ్యారు  1953-54 అలహాబాద్‌లో జరిగిన ప్రజా సోషలిస్ట్ పార్టీ(PSP) మొదటి సమావేశంలో మధు లిమాయే జాయింట్ సెక్రటరీగా ఎన్నికయ్యారు.

మధు లిమాయే 15 మే 1952న ప్రొఫెసర్ చంపా గుప్తేని వివాహం చేసుకున్నారు,  మధు లిమాయే వ్యక్తిగత మరియు ప్రజా జీవితంలో చంపా గుప్తే గొప్ప ప్రేరణ మరియు మద్దతును అందించింది. చంపా గుప్తే నీ లిమాయే సోషలిజం యొక్క సూత్రాలు మరియు ఆదర్శాలపై స్థిరమైన విశ్వాసం ఉన్న బలమైన మహిళ మరియు మధు లిమాయే పోరాటాలు మరియు కష్టాల్లో ఒకరినొకరు ప్రేరణగా, అండగా నిలిచారు.

గోవా విముక్తి ఉద్యమం

1946లో డాక్టర్ రామ్‌మనోహర్ లోహియా ప్రారంభించిన గోవా విముక్తి ఉద్యమంలో మధు లిమయే పాల్గొన్నారు, వలసవాదాన్ని తీవ్రంగా విమర్శించిన లిమాయే 1955లో సామూహిక సత్యాగ్రహానికి నాయకత్వం వహించి గోవాలోకి ప్రవేశించారు.

పెడ్నే వద్ద, పోర్చుగీస్ పోలీసులు సత్యాగ్రహిలపై హింసాత్మకంగా దాడి చేశారు, ఫలితంగా కొందరు మరణించారు మరికొందరు తీవ్ర గాయాలు పాలు అయ్యారు.

మధు లిమాయేను దారుణంగా కొట్టారు. ఐదు నెలల పాటు పోలీసు కస్టడీలో ఉంచారు.

డిసెంబర్ 1955లో, పోర్చుగీస్ మిలిటరీ ట్రిబ్యునల్ మధు లిమాయే కు 12 సంవత్సరాల కారాగార శిక్ష విధించింది. కానీ, మధు లిమాయే ఎలాంటి డిఫెన్స్ ఇవ్వలేదు లేదా శిక్షపై అప్పీల్ చేయలేదు. ఒకసారి మధు లిమాయే ఇలా వ్రాశారు:"గాంధీజీ నా జీవితాన్ని నా వ్యక్తిత్వాన్ని, సంకల్పాన్ని ఎంత లోతుగా, గాఢంగా తీర్చిదిద్దారో గోవాలో నేను గ్రహించాను."

గోవా విముక్తి ఉద్యమం సమయంలో, మధు లిమాయే పోర్చుగీస్ జైలు లో 19 నెలలు గడిపారు.. బందిఖానాలో ఉన్న సమయంలో, మధు లిమాయే జైలు డైరీగా 'గోవా లిబరేషన్ మూవ్‌మెంట్ అండ్ మధు లిమాయే' అనే పుస్తకాన్ని రాశారు. 1946లో జరిగిన గోవా ఉద్యమ స్వర్ణోత్సవాల సందర్భంగా 1996లో 'గోవా లిబరేషన్ మూవ్‌మెంట్ అండ్ మధు లిమాయే' పుస్తకాన్ని ప్రచురించారు.

1957లో పోర్చుగీస్ నిర్బంధం నుండి విడుదలైన తర్వాత, మధు లిమాయే ప్రజలను సమీకరించడం కొనసాగించాడు మరియు వివిధ వర్గాల నుండి మద్దతు కోరాడు మరియు గోవా విముక్తికి గట్టి చర్యలు తీసుకోవాలని భారత ప్రభుత్వాన్ని కోరారు. గోవా విముక్తి సామూహిక సత్యాగ్రహం తరువాత భారత ప్రభుత్వం సైనిక చర్యకు బలవంతం చేయబడింది మరియు పోర్చుగీస్ పాలన నుండి గోవాను విముక్తి చేసింది. గోవా చివరకు డిసెంబర్ 1961లో విముక్తి పొంది భారతదేశంలో అంతర్భాగంగా మారింది.

సోషలిస్టు ఉద్యమ నాయకుడు

సోషలిస్ట్ ఉద్యమం యొక్క అత్యంత చైతన్యవంతమైన నాయకులలో ఒకరిగా, మధు లిమాయే సోషలిస్ట్ ఆదర్శాలను జాతీయ నైతికతలోకి ఇమడ్చడానికి నిరంతరాయంగా కృషి చేశారు. ఆధునిక భారతదేశం యొక్క విధిని రూపొందించడంలో మధు లిమాయే సహకారం నిజంగా అద్భుతమైనది.

కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ, సోషలిస్ట్ పార్టీ మరియు ప్రజా సోషలిస్ట్ పార్టీకి సేవలందించిన తరువాత, మధు లిమాయే 1958 ఏప్రిల్‌లో షెర్ఘుటి (గయా)లో జరిగిన జాతీయ సమావేశంలో సోషలిస్ట్ పార్టీ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. మధు లిమాయే అధ్యక్షతన సోషలిస్ట్ పార్టీ ను నిర్దిష్ట విధానాలు మరియు నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళికలను అనుసరించడం ద్వారా బలోపేతం చేయడంలో బలమైన ప్రయత్నాలు జరిగాయి..

సోషలిజంపై మధు లిమాయే నమ్మకం పిడివాదం లేదా సిద్ధాంతం కాదు, కానీ అది ఒక జీవన విధానం. మధు లిమాయే ప్రకారం క్రమానుగత సామాజిక వ్యవస్థ నాశనం చేయబడకపోతే, సమాజంలోని పెద్ద వర్గానికి సామాజిక న్యాయం సుదూర స్వప్నంగా నిలిచిపోతుంది..

1959లో బెనారస్ కాన్ఫరెన్స్‌లో మధు లిమాయే కీలక పాత్ర పోషించారు, అక్కడ మధు లిమాయే అధ్యక్షతన సోషలిస్ట్ పార్టీ సమాజంలోని వెనుకబడిన వర్గాలకు ప్రత్యేక అవకాశాలను కల్పించే తీర్మానాన్ని ఆమోదించింది.

1964లో SP-PSP విలీనం తర్వాత, మధు లిమాయే 1967లో కొత్తగా ఏర్పడిన సంయుక్త సోషలిస్ట్ పార్టీ పార్లమెంటరీ బోర్డ్‌కు ఛైర్మన్ అయ్యాడు మరియు 1967లో ఏర్పడిన నాల్గవ లోక్‌సభ లో సంయుక్త సోషలిస్ట్ పార్టీ నాయకుడిగా ఉన్నారు.

## విశిష్ట పార్లమెంటేరియన్

మధు లిమాయే  ఒక విశిష్ట పార్లమెంటేరియన్.  మధు లిమాయే 1964 నుండి 1979 వరకు నాలుగు సార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. మధు లిమాయే వివిధ విషయాలపై లోతైన అవగాహనకు, పార్లమెంటరీ నియమావళి యొక్క పరిజ్ఞానం మరియు పార్లమెంటరీ పద్ధతులను, సంప్రదాయాలను సమర్థవంతంగా ఉపయోగించడం లో ప్రసిద్ధి చెందారు. మధు లిమాయే భారత రాజ్యాంగం పై  ఒక ఎన్సైక్లోపీడియా మరియు వివిధ రాజ్యాంగ విషయాలపై పార్లమెంటులో మధు లిమాయే చేసిన ప్రసంగాలు భద్రపరచదగినవి.  మధు లిమాయే పార్లమెంటరీ ప్రసగాలు పాండిత్యం, పరిపక్వత మరియు అవగాహనను ప్రతిబింబించడమే కాకుండా సామాన్య ప్రజల కోసం అతని శ్రద్ధ మరియు నిబద్ధతను కూడా ప్రదర్శించాయి. మధు లిమాయే మాట్లాడటానికి లేచినప్పుడల్లా, పార్లమెంట్ సభ్యులు అందరు అతని ప్రసంగాని  శ్రద్ధగా వినేవారు..

మధు లిమాయే ప్రకారం: "పార్లమెంటు అనేది సామూహిక మరియు ప్రజా ఉద్యమాలకు ప్రత్యామ్నాయం కాదు కానీ ప్రజా సేవ యొక్క అదనపు సాధనం మరియు ప్రజా ఫిర్యాదులను ప్రసారం చేయడానికి ఒక వేదిక. సామాన్యుల ఆశలు, స్ఫూర్తిని ప్రతిబింబించే సాధనంగా పార్లమెంట్ ను  ఉపయోగించాలి.

మధు లిమాయే తన అపారమైన జ్ఞానాన్ని సమర్థవంతంగా ప్రదర్శించడం ద్వారా పార్లమెంట్ ముందు ముఖ్యమైన సమస్యలను లేవనెత్తారు. తన అసమానమైన శైలిలో చర్చలు మరియు సభా కార్యక్రమాలను సుసంపన్నం చేసిన అత్యుత్తమ పార్లమెంటేరియన్‌గా మధు లిమాయే గుర్తుండిపోతారు.

సివిల్ లిబర్టీస్ ఛాంపియన్

మధు లిమాయే తన జీవితాంతం పౌర హక్కుల కోసం పోరాడారు. మధు లిమాయే అనేక కేసులను ఎదుర్కొన్నాడు మరియు తన కేసులను దిగువ కోర్టుల నుండి హైకోర్టులు మరియు సుప్రీంకోర్టు వరకు స్వయంగా  వాదించి విజయం సాధించారు.

1955లో, మధు లిమాయే గోవాలో పోర్చుగీస్ అధికారులకు వ్యతిరేకంగా సామూహిక సత్యాగ్రహానికి నాయకత్వం వహించి, విచారణ లేకుండా ఐదు నెలల పాటు పోలీసు కస్టడీలో ఉంచబడినప్పుడు, తరువాత పోర్చుగీస్ మిలిటరీ ట్రిబ్యునల్ 12 సంవత్సరాల జైలు శిక్ష విధించినప్పుడు, మధు లిమాయే ఎలాంటి వాదనలు వినిపించలేదు లేదా భారీ శిక్షపై అప్పీల్ చేయలేదు. మధు లిమాయే ప్రకారం సామూహిక సత్యాగ్రహం ఒక విముక్తి ఉద్యమం కానీ తరువాత అరెస్టు చేయబడిన ప్రతిసారీ స్వేచ్ఛా భారతదేశంలో అక్రమ నిర్బంధాలను సవాలు చేశారు.

1959లో, మధు లిమాయే సోషలిస్ట్ పార్టీ ఛైర్మన్‌గా ఉన్నప్పుడు, ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా సోషలిస్ట్ పార్టీ పంజాబ్ యూనిట్ ఉద్యమం ప్రారంభించినప్పుడు పంజాబ్ రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పర్యటించినాడు.1959 జనవరి 7న హిసార్ జిల్లా సోషలిస్ట్ పార్టీ కార్యాలయంలో కూర్చున్నప్పుడు, ఎలాంటి వారెంట్ లేకుండానే మధు లిమాయే ను పోలీసులు అరెస్టు చేశారు

తన అరెస్టుకు వ్యతిరేకంగా ఐపీసీ 226 కింద పంజాబ్ హైకోర్టులో మధు లిమాయే హెబియస్ కార్పస్ దాఖలు చేశారు. అక్రమ నిర్బంధానికి వ్యతిరేకంగా మధు లిమాయే చేసిన రిట్‌ను హైకోర్టు అంగీకరించి 1959 ఫిబ్రవరి 2న విడుదల చేసింది.

ఆర్టికల్ 144 మరియు రైల్వే చట్టం 122ను ఉల్లంఘించినందుకు లఖిసరాయ్ రైల్వే స్టేషన్‌లో మధు లిమాయే, 5 నవంబర్ 1968న రెండోసారి అరెస్టయ్యాడు. మధు లిమాయే తన అరెస్టును సుప్రీంకోర్టులో సవాలు చేశాడు మరియు అతని అరెస్టు చట్టవిరుద్ధమని కోర్టు ప్రకటించి, మధు లిమాయే ను  వెంటనే 18 డిసెంబర్ 1968న విడుదల చేసింది.

అధికార పార్టీ తన రాజకీయ ప్రత్యర్థులను అణిచివేసేందుకు లేదా ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నిరసన తెలపడానికి పరిపాలన మరియు పోలీసులు చేసిన అరెస్టును సవాలు చేసిన మధు లిమాయే  కు కోర్టు కేసుల  యొక్క సుదీర్ఘ జాబితా ఉంది. పౌరుల పౌర హక్కులను కాలరాయడానికి ప్రభుత్వం అవలంబిస్తున్న రాజ్యాంగ విరుద్ధ పద్ధతులను మధు లిమాయే తీవ్రంగా ఖండించారు.

అరవైల చివరలో, రాజ్యాంగ విరుద్ధమైన వివాదాలు జాతీయ చర్చ యొక్క కేంద్ర బిందువు అయ్యాయి. . రాజ్యాంగ విరుద్ధ సమస్యలపై మధు లిమాయే తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ అప్పటి రాష్ట్రపతి వి.వి గిరి. మరియు సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.ఎస్. హెగ్డే కి రాజ్యాంగం మరియు సంప్రదాయాలపై లేఖలు రాశారు. మధు లిమాయే తరువాత ఈ విషయాలను తన పుస్తకాలలో 'లిమిట్స్ టు అథారిటీ, కొత్త రాజ్యాంగ సవరణలు: ప్రజా స్వాతంత్ర్యం యొక్క మరణ మృదంగం. పార్లమెంట్, న్యాయవ్యవస్థ మరియు పార్టీలు - రాజకీయాల ఎలక్ట్రో కార్డియోగ్రామ్ Limits to Authority, New Constitutional amendments: death-knell of popular liberties. Parliament, Judiciary, and Parties – an Electrocardiogram of Politics in detail' గురించి వివరంగా చర్చించారు.

విదేశీ విధానం మరియు అంతర్జాతీయ సంబంధాల నిపుణుడుForeign Policy and International Relations Expert

మధు లిమాయే అలీనవాదము Non-alignment ను దృఢంగా విశ్వసించేవాడు. మధు లిమాయే దృష్టిలో అలీనవాదము, వలసవాద వ్యతిరేకత, ప్రజలందరికీ స్వేచ్ఛ, నిరాయుధీకరణ, అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థిక ప్రయోజనాల పరిరక్షణ మరియు ప్రపంచ శాంతి. అనే భావనలు భారత స్వాతంత్ర్య పోరాట సిద్దంతాలలో ఇమిడి ఉన్నవి.

అలీనోద్యమానికి కొత్త రూపం ఇవ్వాలని మధు లిమాయే కోరుకున్నారు. అణగారిన ప్రజల ఆర్థిక మరియు సామాజిక ఆకాంక్షలను అలీనోద్యమ0 స్పష్టంగా ప్రతిబింబిస్తుందని మధు లిమాయే భావించారు. ఉత్తర-దక్షిణ ఘర్షణ విషయంలో భారతదేశం దృఢమైన వైఖరిని తీసుకోవాలని మధు లిమాయే అభిప్రాయపడ్డారు, ఎందుకంటే అలీనోద్యమ0 రాజకీయ మరియు ఆర్థిక సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా వలసవాద ప్రజల పోరాటానికి పొడిగింపు.

సామ్రాజ్యవాద ఆధిపత్యానికి వ్యతిరేకంగా అలీన విధానం పనిచేయాలి. అదే సమయంలో, ఇతర దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలకు అలీన విధానం ప్రతిబంధకం కాకూడదు.. భారతదేశ విదేశాంగ విధానం యొక్క స్వతంత్రత అన్ని రకాలుగా నిర్ధారించబడాలని మరియు దీర్ఘకాలంలో మన రాజకీయ, ఆర్థిక మరియు వ్యూహాత్మక ప్రయోజనాలను కాపాడుకోవడమే లక్ష్యంగా ఉండాలని మధు లిమాయే నొక్కి చెప్పారు.

రాజకీయ స్వాతంత్ర్యంతోపాటు దేశాలు ఆర్థిక దోపిడీ నుంచి కూడా విముక్తి పొందాలని మధు లిమాయే అభిప్రాయపడ్డారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాలు పూర్వపు తమ పాలనలోని వలస దేశాల ఆర్థిక వృద్ధికి

దోహదపడే వాతావరణాన్ని  కూడా సృష్టించాలి. అప్పుడే అలీన విధానం అర్థవంతంగా మారుతుంది.

అణు సమస్యపై, అన్ని అణు శక్తి గలిగిన దేశాలు తాము  కూడబెట్టిన అణ్వాయుధాలను నాశనం చేయడంతో సహా పూర్తి నిరాయుధీకరణకు అంగీకరిస్తే తప్ప, భారతదేశం తన స్వంత అణు అభివృద్ధి విషయంలో ఎటువంటి రాజీ పడకూడదని మధు లిమాయే ఎల్లప్పుడూ బలంగా అంటూ ఉండేవారు. భారతదేశం స్వయం సమృద్ధిగా మారడానికి వీలైనంత త్వరగా తన స్వంత అణు సాంకేతికతను అభివృద్ధి చేసుకోవాలని మధు లిమాయే విశ్వసించారు.

1971లో బంగ్లాదేశ్‌లో ఏర్పడిన సంక్షోభ సందర్భంలో, మధు లిమాయే అప్పటి భారత ప్రభుత్వానికి తన మద్దతునిచ్చాడు. బంగ్లాదేశ్ విముక్తికి అనుకూలంగా ప్రపంచ అభిప్రాయాన్ని సమీకరించడంలో నాయకత్వం వహించడానికి మధు లిమాయే,  జయప్రకాష్ నారాయణ్‌ను ఒప్పించారు. మధు లిమాయే నిజమైన జాతీయవాది. బంగ్లాదేశ్ విముక్తి కోసం అంతర్జాతీయ మద్దతును కూడగట్టడానికి మధు లిమాయే వివిధ దేశాలలో పర్యటించారు.

నాలుగు దశాబ్దాల పాటు సాగిన తన ప్రజా జీవితంలో, మధు లిమాయే ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలను సందర్శించారు. మధు లిమాయే రంగూన్‌లో ప్రధాన కార్యాలయాన్ని కలిగి ఉన్న ఆసియా సోషలిస్ట్ బ్యూరో కార్యదర్శిగా కూడా ఉన్నారు., మధు లిమాయే 1953లో పారిస్‌లోని కౌన్సిల్ ఆఫ్ సోషలిస్ట్ ఇంటర్నేషనల్ సమావేశానికి పరిశీలక ప్రతినిధిగా హాజరయ్యాడు. మధు లిమాయే అనేక విదేశీ పర్యటనలలో డాక్టర్. లోహియాతో కూడా కలిసి వెళ్ళారు.. మధు లిమాయే 1967లో మాస్కోలో జరిగిన రష్యన్ విప్లవం యొక్క 50వ వార్షికోత్సవ వేడుకలకు S.M. జోషి తో కలిసి హాజరు అయ్యారు. .

వివిధ దేశాల పర్యటనలు మధు లిమాయే కి అంతర్జాతీయ సంబంధాల గతిశీలతపై అపారమైన అనుభవాన్ని అందించాయి. భారతీయ విదేశాంగ విధానం యొక్క బలమైన పునాదిని ఏర్పరచడానికి అంతర్జాతీయ సమస్యలపై విశేష జ్ఞానం, హెరాల్డ్ లాస్కీ వంటి ప్రముఖ ఆలోచనాపరులు మరియు ఇతర ప్రముఖ వ్యక్తులతో పరస్పర సంబంధాలు మధు లిమాయే కి సహాయపడినవి..

సోషలిజం & సెక్యులరిజంపై మధు లిమాయే ఆలోచనలు

మధు లిమాయే ఆలోచనలు లౌకిక జాతీయతపై నిర్మించబడినవి మరియు భారతదేశం యొక్క లౌకిక గుర్తింపు పై మధు లిమాయే రాజీలేని వైఖరిని కలిగి ఉన్నారు. భారతదేశ మిశ్రమ మరియు బహుళ సంస్కృతి యొక్క సారాంశాన్ని ప్రతిబింబించే భారత రాజ్యాంగ లౌకిక పునాదుల పరిరక్షణ కోసం దృడంగా మధు లిమాయే నిలబడ్డారు..

ప్రజాస్వామ్య విలువలు

ప్రజాస్వామ్యం మరియు ప్రజాస్వామ్య విలువలపై దృఢమైన నమ్మకంతో మధు లిమాయే పార్లమెంటరీ సార్వభౌమాధికారాన్ని కాపాడేందుకు అవిశ్రాంతంగా పోరాడారు. తన రచనలు, ప్రసంగాలు మరియు చర్యల ద్వారా మధు లిమాయే అనేక మార్గాల్లో ప్రజాస్వామ్య వారసత్వాన్ని రక్షించడానికి ప్రయత్నించారు.

ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్య విలువలకు దృఢంగా కట్టుబడిన, మధు లిమాయే తన విలువలతో ఎప్పుడూ రాజీపడలేదు. ఐదవ లోక్‌సభ పదవీకాలం పొడిగింపునకు వ్యతిరేకంగా మధు లిమాయే జైలు నుంచి చేసిన నిరసన దీనికి నిదర్శనం.

JP ఉద్యమంలో మరియు 1974-77లో ఐక్య ప్రతిపక్ష పార్టీని సృష్టించే ప్రయత్నంలో మధు లిమాయే చురుకైన పాత్ర పోషించారు. మధు లిమాయే జూలై 1975 నుండి ఫిబ్రవరి 1977 వరకు వివిధ మధ్యప్రదేశ్ జైళ్లలో MISA కింద నిర్బంధించబడ్డాడు. రాజ్యాంగ నిబంధనలను దుర్వినియోగం చేసి ఎమర్జెన్సీ విధించి శ్రీమతి ఇందిరా గాంధీ 5వ లోక్‌సభ పదవీకాలాన్ని అనైతికంగా పొడిగించినందుకు నిరసనగా తన యువ కామ్రేడ్ శరద్ యాదవ్‌తో కలిసి మధు లిమాయే 5వ లోక్‌సభ సభ్యత్వానికి రాజీనామా చేశారు..

ఎమర్జెన్సీ తర్వాత కేంద్రంలో అధికారం చేపట్టిన జనతాపార్టీ ఏర్పాటులోనూ, కూటమిలోనూ క్రియాశీలకంగా వ్యవహరించారు. 1 మే 1977న తన 55వ పుట్టినరోజున మధు లిమాయే జనతా పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు

.కానీ జనతా పార్టీకి చెందిన ఏ సభ్యుడు ఏకకాలంలో ప్రత్యామ్నాయ సామాజిక లేదా రాజకీయ సంస్థలో సభ్యులుగా ఉండకూడదని పట్టుబట్టడం ద్వారా మొరార్జీ దేశాయ్ నేతృత్వంలోని జనతా సంకీర్ణ ప్రభుత్వం పతనానికి కూడా మధు లిమాయే కారణమయ్యాడు.ద్వంద్వ సభ్యత్వం సమస్య 1979లో జనతా ప్రభుత్వం పతనానికి, జనతా పార్టీ నాశనానికి దారితీసింది.

తరువాత, మధు లిమాయే చరణ్ సింగ్ క్యాంపులో చేరాడు మరియు 1979-82 వరకు జనతా పార్టీ (S) మరియు లోక్ దళ్, ప్రధాన కార్యదర్శి అయ్యాడు. 1982లో లోక్ దళ్ నుంచి విడిపోయి లోక్ దళ్ (కె)ని స్థాపించారు. మధు లిమాయే 1982లో క్రియాశీల రాజకీయాల నుండి విరమించుకున్నారు మరియు ఆంగ్లం, హిందీ మరియు మరాఠీలలో 60కి పైగా పుస్తకాలు రాశారు

సఫలవంతమైన రచయిత

మధు లిమాయే రచనలు తార్కికంగా, నిర్భయంగా మరియు సూటిగా ఉంటాయి మరియు వాస్తవాలు, చారిత్రక దృక్పథంతో వెలుబడినవి.. మధు లిమాయే 1982 నుండి క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉన్నప్పటికీ, తన అనేక రచనల ద్వారా దేశం యొక్క సామాజిక, రాజకీయ మరియు ఆర్థిక అభివృద్ధికి సంబంధించిన సమస్యలపై తన భావాలను నిర్భయంగా వెలుబుచ్చారు.

రాజ్యాంగ మరియు పార్లమెంటరీ ఔచిత్యం మరియు జాతీయ ప్రాముఖ్యత కలిగిన విభిన్న విషయాలను కవర్ చేసే పాండిత్య లక్షణాలు మధు లిమాయే రచనలలో ప్రతిబింబిస్తాయి. మధు లిమాయే తన రచనలలో లేవనెత్తిన జాతీయ మరియు అంతర్జాతీయ సమస్యలు ఆలోచనకు అవకాసమిస్తాయి. .

మధు లిమాయే అద్భుతమైన ఆలోచనలను దేశప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారు. రాబోయే తరాలకు గొప్ప ప్రేరణగా మధు లిమాయే నిలిచారు.

మధు లిమాయే రచనలలో కొన్ని: “ ఇండియా పాలిటీ ఇన్ ట్రాన్సిషన్, ఇండియా అండ్ ది వరల్డ్, బర్త్ ఆఫ్ నాన్-కాంగ్రెస్సిజం, కమ్యూనిస్ట్ పార్టీ: ఫ్యాక్ట్స్ అండ్ ఫిక్షన్ అండ్ ఎవల్యూషన్ ఆఫ్ సోషలిస్ట్ పార్టీ India Polity in Transition, India and the World, Birth of Non- Congressism, Communist Party: Facts and Fiction and Evolution of Socialist Party”.

చరిత్ర యొక్క వివిధ దశలలో భారతీయ సమాజం ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై లోతైన అవగాహనకు మధు లిమాయే రచనలు తోడ్పడతాయి.. మధు లిమాయే రచనలు సామాజిక-ఆర్థిక మరియు రాజకీయ పరిస్థితి మరియు సమకాలిన సోషలిస్ట్ నాయకుల అభిప్రాయాలపై లోతైన అంతర్దృష్టిని అందిస్తాయి.

స్వాతంత్ర్య ఉద్యమంలో మధు లిమాయే చేసిన ప్రశంసనీయమైన కృషికి, భారత ప్రభుత్వం సన్మాన్ మరియు పెన్షన్ అందించింది. కానీ, గోవా విమోచన ఉద్యమానికి చేసిన కృషికి గుర్తింపుగా ఏ విధమైన ప్రయోజనాలను మధు లిమాయే అంగీకరించలేదు.

పార్లమెంటు సభ్యులకు అందించే పెన్షన్ స్కీమ్‌ను కూడా మధు లిమాయే ఆమోదించలేదు. నిబద్ధత కలిగిన సోషలిస్టుగా, మధు లిమాయే నిస్వార్థ త్యాగ స్ఫూర్తిని ప్రదర్శించారు, ఇది రాబోయే కాలానికి గుర్తుగా మిగిలిపోతుంది.

చివరి దశ

లోక్ దళ్ (కె) ఏర్పడిన తర్వాత 1982లో క్రియాశీల రాజకీయాల నుంచి మధు లిమాయే రిటైర్ అయ్యారు. పదవీ విరమణ సమయంలో, మధు లిమాయే 1980ల వరకు రాయడం కొనసాగించాడు. మధు లిమాయే రాజ్యాంగ సమస్యలపై ప్రత్యేకించి అధికారాన్ని కేంద్రీకరించడానికి లేదా వెస్ట్‌మినిస్టర్ వ్యవస్థను అధ్యక్ష పాలనగా మార్చడానికి ప్రయత్నించే వారికి వ్యతిరేకంగా మీడియాలో తన వ్యాసాల ద్వారా రాజ్యాంగాన్ని రక్షించే పనిని చేపట్టారు.

మధు లిమాయే 8 జనవరి 1995న న్యూ ఢిల్లీలో 72 సంవత్సరాల వయస్సులో అనారోగ్యంతో మరణించారు. మధు లిమాయే తీవ్రమైన బ్రోన్చియల్ ఆస్తమా acute bronchial asthmaతో బాధపడుతున్నారు.

పౌర హక్కులను పరిరక్షించడానికి మరియు సామాజిక న్యాయం కోసం పోరాడుతున్న మధు లిమాయేను రాబోయే తరాలు గుర్తుంచుకుంటాయి. చురుకైన పార్లమెంటేరియన్‌గా, మధు లిమాయే ఎల్లప్పుడూ శ్రమతో కూడిన పరిశోధన మరియు హోంవర్క్ చేసిన తర్వాత ఇంటికి వచ్చే పార్లమెంట్ సభ్యుల ప్రత్యేక తరానికి చెందినవాడు.

అత్యంత చిత్తశుద్ధి ఉన్న వ్యక్తి, మధు లిమాయే ఎల్లప్పుడూ దృఢ నిశ్చయంతో వ్యవహరించారు. మధు లిమాయే ప్రజా జీవితంలో అత్యున్నత నైతిక మరియు నైతిక నిబంధనలకు ఉదాహరణగా నిలిచాడు. మధు లిమాయే మరణంతో దేశం నిజమైన దేశభక్తుడిని, జాతీయవాదిని, ప్రఖ్యాత ఆలోచనాపరుడిని, సోషలిస్టు నాయకుడిని, విశిష్ట పార్లమెంటేరియన్‌ను కోల్పోయింది.

మధు లిమాయే ఇంగ్లీష్, హిందీ మరియు మరాఠీ భాషలలో 100 కంటే ఎక్కువ పుస్తకాలు రాశారు మరియు వివిధ పత్రికలు, పత్రికలు మరియు వార్తాపత్రికలలో 1000 కంటే ఎక్కువ వ్యాసాలను అందించారు.

రచయిత: ఖుర్బాన్ అలీ,న్యూ డిల్లీ

జనవరి 7, 2025, ఖుర్బాన్ అలీ ద్వారా Ummid.com ప్రచురించిన వ్యాసం.

(రచయిత, ఖుర్బాన్ అలీ, ఆధునిక భారతదేశం యొక్క ప్రధాన రాజకీయ, సామాజిక మరియు ఆర్థిక పరిణామాలను కవర్ చేసిన త్రిభాషా పాత్రికేయుడు. ఖుర్బాన్ అలీ భారతదేశ స్వాతంత్ర్య పోరాటాన్ని మరియు ఇప్పుడు దేశంలోని సోషలిస్ట్ ఉద్యమ చరిత్రను డాక్యుమెంట్ చేస్తున్నారు.

ఖుర్బాన్ అలీ ని qurban100@gmail.comలో సంప్రదించవచ్చు.)

తెలుగు అనువాదం:: ముహమ్మద్ అజ్గర్ అలీ.తెనాలి.